సాక్షి
కామారెడ్డి
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



తాగునీటి సమస్య తీర్చాలంటూ..
తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తాడ్వాయి మండలకేంద్రంలోని బీసీ కాలనీలో ప్రజలు ఆందోళనకు దిగారు.
- 9లో ▸



రైతులు ఆర్థికంగా ఎదగాలి
వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.1 /16.8
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం క్రమంగా ఎండ తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

‘కాంగ్రెస్’లో కలవరం!

- వరుసగా వచ్చి చేరుతున్న బీఆర్ఎస్ లీడర్లు
- తమ అవకాశాలు దెబ్బతింటాయని పాత నేతల్లో ఆందోళన
- కొత్తవాళ్లకే పదవులిస్తారన్న ఆవేదన

రాష్ట్రంలో సుమారు పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చామన్న జోష్‌లో ఉన్న కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం మొదలయ్యింది. బీఆర్ఎస్ నేతలు హస్తం గూటికి చేరుతుండడాన్ని సీనియర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా సేవలందించినవారికి కాకుండా కొత్తగా చేరుతున్న వారికే గుర్తింపు దక్కుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఓడిపోయి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. తర్వాతి కాలంలో కాంగ్రెస్‌లోంచి పలువురు నేతలు గులాబీ కండువా కప్పుకున్నారు. కొందరు మాత్రం ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ గెలవడంతో వారంతా ఎంతో సంతోషించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయాలని, కాంట్రాక్టులు, పైరవీలు చేసుకోవచ్చని పలువురు కలలు కన్నారు. అయితే ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు వారిని కలవరానికి గురిచేస్తున్నాయి. నిన్నమొన్నటి దాకా బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన వారంతా ఇప్పుడు కాంగ్రెస్‌లోకి చేరుతుండడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పైగా వాళ్లు రావడం వల్ల తమ అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు.

బల్దియాలో అధికార పార్టీలోకి వలసలు..

కామారెడ్డి నియోజకవర్గంలోని కామారెడ్డి పట్టణంతో పాటు ఆయా మండలాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇంకా చేరుతూనే ఉన్నారు. వచ్చిన వాళ్లను వచ్చినట్టుగా చేర్చుకుంటుండడం కాంగ్రెస్ పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్న క్యాడర్‌కు మింగుడుపడడం లేదు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు చేరడంతో తమ ఆశలు ఎక్కడ గల్లంతవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఏళ్లుగా కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్న తమకు ఈసారి టికెట్టు వస్తుందన్న ధీమాతో ఉన్న వాళ్లంతా కౌన్సిలర్ల చేరికలతో కలవరపడుతున్నారు. ఇప్పటికే ఇరవై మంది వరకు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఆయా వార్డుల్లో ఏళ్లుగా ప్రజలతో సంబంధాలు పెంచుకుంటూ, ఎన్నికల్లో పోటీ చేయాలని కలలుగన్న వారంతా ఇప్పుడు సందిగ్ధంలో పడ్డారు. కొత్తగా వచ్చి చేరిన వారికి టికెట్టు ఇస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దశాబ్ద కాలంగా ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని పార్టీ కోసం పనిచేశామని, తీరా అధికారంలోకి రావడంతోనే ఇతర పార్టీల వాళ్లు వచ్చి చేరితే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన చెందుతున్నారు.

మండలాల్లోనూ అదే పరిస్థితి..

నియోజకవర్గంలోని మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, కామారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి తదితర మండలాల్లో కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ నేతలు క్యూ కడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారిని ఇప్పుడు పార్టీలోకి ఎలా చేర్చుకుంటున్నారని కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆయా మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య గొడవలు కూడా ఉన్నాయి. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో కొందరు తమపై దౌర్జన్యం చేశారని, అలాంటి వారిని ఇప్పుడు కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడం మూలంగా తాము చులకన అవుతామని పాత నేతలు పేర్కొంటున్నారు. పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారిని పట్టించుకోకుండా, పార్టీలో కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని అంటున్నారు. నేతలను చేర్చుకునే విషయంలో తమ మాట కూడా వినాలని పలువురు కోరుతున్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి టౌన్: అయోధ్య రామాలయ సందర్శనకు బుధవారం కామారెడ్డినుంచి భక్తులు ప్రత్యేక రైలులో బయలుదేరి వెళ్లారు. రైలును బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భక్తుల కోసం రైలును ఏర్పాటు చేశారన్నారు. ఈ రైలు 1,345 మంది భక్తులతో కామారెడ్డినుంచి బయలుదేరిందన్నారు. శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ రాష్ట్ర కన్వీనర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. భక్తులు దర్శనం పూర్తి చేసుకుని ఈనెల 26 వరకు కామారెడ్డికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆలె భాస్కర్, పైడి ఎల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, రంజిత్ మోహన్, మర్రి రాంరెడ్డి, తెలు శ్రీనివాస్, బాపురెడ్డి, రాము, భరత్, సురేష్, నరేందర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కామారెడ్డి టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలను ఈనెల 24 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 నుంచి 27 వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు హయ్యర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 25 నుంచి 27 వరకు రోజూ ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్ష, 2 గంటల నుంచి 5 గంటల వరకు హయ్యర్ గ్రేడ్ పరీక్ష జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు పెన్సిల్, కలర్స్, పరీక్ష అట్టలు ఇతర సామగ్రిని వెంట తెచ్చుకోవాలని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ అభ్యర్థులు కుట్టు మిషన్లు, టేబుల్, కత్తెర సామగ్రిని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

‘ఓవర్సీస్’ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం పేద మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో అన్ని అర్హత ప్రమాణాలున్న విశ్వవిద్యాలయాల్లో పీజీ, డాక్టరేట్ కోర్సులలో చేరడానికి గత ఆగస్టు 1వ తేదీ నుంచి 31 డిసెంబర్ వరకు తీసుకున్న అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు మార్చి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 80969 73346 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్: అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. ఇప్పటివరకు 3.54 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ జరిగిందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 166 మంది విద్యార్థులకుగాను 160 మంది పరీక్షలకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ తెలిపారు. పరీక్షలను ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌తో పాటు అధ్యాపకులు హరిత, సరిత, అంజయ్య, శ్రీమాత పర్యవేక్షించారు.

డిప్యుటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయుల రాక

సాక్షి ఎఫెక్ట్..

సదాశివనగర్: ఉత్తనూరు ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను పంపించారు. ఈ పాఠశాలలో విద్యార్థులున్నా టీచర్ ఒక్కరే విధులు నిర్వహిస్తుండడంతో చదువులు సాగడం లేదు. దీనిపై ఈనెల 13న ‘విద్యాశాఖలో వింత పోకడ’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యా శాఖ అధికారులు స్పందించారు. సదాశివనగర్ నుంచి ఒకరిని, గాంధారి మండలం నుంచి మరొక టీచర్‌ను డిప్యుటేషన్‌పై ఉత్తనూరుకు పంపించాచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త రకం వంగడాలను సాగు చేయాలి

ధర్పల్లి: రైతులు కొత్తరకం విత్తనాలను సాగు చేసి అధిక లాభాలను పొందాలని ఎన్‌సీడీసీ రీజినల్ డైరెక్టర్ వంశీకృష్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ కో–ఆప్షన్ సొసైటీ లిమిటెడ్(ఎఫ్‌పీవో)ను సందర్శించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈక్విటీ గ్రాంట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఎఫ్‌పీవో సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ సీపీ గౌస్, పాటిల్ ఎఫ్‌పీవో చైర్మన్ మహిపాల్ యాదవ్, సీవో సుజాత, డైరెక్టర్లు కోటి శేఖర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

‘సస్యరక్షణ చర్యలు చేపట్టాలి’

కామారెడ్డి రూరల్: రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం ఆమె తిమ్మక్‌పల్లిలోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటలో అక్కడక్కడ మొగిపురుగు ఆశిస్తోందని, దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఒక ఎకరానికి 810 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 78 కిలోలు ఇసుకలో సమానంగా కలిపి సాయంత్రం వేళలో చల్లాలని సూచించారు.

పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్టప్ హైడ్రోక్లోరైడ్(50% ఎస్‌పీ) అనే మందును 2 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పొలం అంతా సమానంగా పిచికారి చేయాలన్నారు. ముందుగా వేసిన వరి పొలంలో ఆకులపై చిన్నచిన్న గోధుమ వర్ణంలో బూడిద రంగు మచ్చలు గమనించడం జరిగిందని కావున రైతులందరూ లక్షణాలు గమనించిన వెంటనే ట్రైసైక్లోజోల్ అనే మందును 0.6 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటలో ఆకులు ముదురు నీలి రంగులోకి మారి వడలిపోతుంటే వెంటనే డీఏపీ పోషక ఎరువును 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు సాయిలు రాములు, వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిమ్మక్‌పల్లిలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి

‘నిబంధనలు పాటించాలి’



కామారెడ్డి క్రైం: వాహనదారులు మోటారు వాహన చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు నూతన చట్టం ప్రకారం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా బాధిత కుటుంబానికి ప్రభుత్వమే నష్ట పరిహారం అందిస్తుందన్నారు. అయితే ధ్రువీకరణ పత్రాలు, డాక్యుమెంట్లు అన్నీ సక్రమంగా ఉన్నప్పుడే పరిహారం అందుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించిన ట్యాక్సులను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. ఆలస్యం చేస్తే 50 శాతం, రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: వచ్చే ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాలలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 791 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లకు సంబంధించిన మొదటిదశ పరిశీలన పూర్తయ్యిందన్నారు. త్వరలోనే వీటిపై అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. నూతన ఓటర్ల నమోదుతో పాటు ఓటింగ్ శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటింగ్ శాతం పెంచడంపై అవగాహన కల్పించేందుకు స్వయం సహాయక సంఘాలు, జిల్లా, మండల సమాఖ్యలకు మార్చి 7న రంగోళి, మెహందీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 న గ్రామ, మున్సిపల్ స్థాయిలలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో మానవహారాలు, 22 న బూత్ స్థాయిలో ఓటింగ్ శాతం పెంపుదలపై సమావేశాలు, 23 న ప్రతి నియోజకవర్గంలో 5 కె రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మార్చి 28న నియోజకవర్గాలలో ఎంపిక చేసిన గోడలపై వాల్ గ్రాఫిటీ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఖాసీం అలీ, జూకంటి ప్రభాకర్ రెడ్డి, మదన్‌లాల్ జాదవ్, హరిలాల్ నాయక్, మహమ్మద్ జాఫర్ ఖాన్, అనిల్ కుమార్, నరేందర్, గజం నిరంజన్, ఎన్నికల పర్యవేక్షకులు అనిల్ కుమార్, ఇందిర ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కాషాయమయం చేయాలి

- నా జోలికొస్తే కాంగ్రెస్ చరిత్ర బయటపెడతా
- ఐదేళ్లలో దేశంలో పసుపు సాగు విస్తీర్ణం పెరిగింది
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణను కాషాయమయం చేయాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని బోర్గాం(పి) మొటాటిరెడ్డి సంఘంలో కొమురంభీం క్లస్టర్ విజయ సంకల్ప బస్సు యాత్రకు సంబంధించి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లలో ఆగం చేసిన కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. ఏ ఒక్క గ్యారంటీ అమలు చేసింది లేదన్నారు. కాంగ్రెస్ అబద్ధాలు, మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందని, చివరికి ఆ పార్టీని నమ్ముకున్న ముస్లింలను కూడా మోసం చేస్తుందని పేర్కొన్నారు.

రాజకీయాల్లో నిజాయితీ కోసం ప్రయత్నం..

ప్రధాని మోదీ పాలనలో ఐదేళ్లలో సుమారు 65వేల హెక్టార్ల పసుపు సాగు విస్తీర్ణం పెరిగిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. పసుపు ధర ఎందుకు పెరుగుతుందో మంత్రి తుమ్మలకు తెలియడం లేదని, ధర పెరగడానికి ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. సనాతన ధర్మం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, దేశ రక్షణ తదితర కార్యక్రమాలతో దేశ విలువ అంతర్జాతీయంగా పెంచుతున్నారన్నారు. డబ్బులు పంచితే అవినీతి పెరుగుతుందని, రాజకీయాల్లో నిజాయితీ తేవాలనే ప్రయత్నం చేస్తున్నానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని, ఈసారి జిల్లా పరిషత్‌పై కాషాయ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

బస్సుయాత్ర విజయవంతం చేయాలి

బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 27న సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో ప్రవేశిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తెలిపారు. యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారి వెంకటరమణి, అసెంబ్లీ ప్రభారి రాజు, పార్లమెంట్, అసెంబ్లీ కన్వీనర్లు గద్దె భూమన్న, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 5లక్షల కోట్లు మింగిన కేసీఆర్

సుభాష్‌నగర్: రాష్ట్ర అప్పులు రూ.6 లక్షల కోట్లకు చేరగా, అందులో మాజీ సీఎం కేసీఆర్ రూ.5 లక్షల కోట్లు మింగేశాడని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ఆర్‌ను చంపిందెవరో తనకు తెలుసని అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అనవసరంగా తన జోలికి వస్తే కాంగ్రెస్ చరిత్ర మొత్తం బయటపెడతానని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరన్నారు. ఇంకో పార్టీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి విమర్శించారు. కాళేశ్వరంపై ఎందుకు విచారణ చేపట్టడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

బాన్సువాడ: పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారిలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆర్థిక చేయూతనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న పాటిల్

ఈ పథకం ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకానికి మున్సిపాలిటీ పరిధిలో 620 మంది దరఖాస్తు చేసుకున్నారని, 20 బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు ఫారాలను అందజేస్తున్నామని, ప్రతీ అంశాన్ని ఆ ఫారంలో పొందుపరచాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ అలీం, మున్సిపల్ సిబ్బంది తుల శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీపీ కోసం ప్రణాళికలు తయారు చేయాలి



బిచ్కుంద(జుక్కల్): గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వనరులను వినియోగించుకొని ఆర్థిక అభివృద్ధి కోసం కార్యదర్శులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. బుధవారం బిచ్కుంద రైతు వేదికలో మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పిట్లం, పెద్దకొడప్‌గల్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని అవగాహన కల్పించాలని అన్నారు. ఎంపీవో మహిబూబ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి జూనియర్ స్టాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అనంతరం పోటీలకు ఎంపికైన కల్యాణ్‌రాజ్, అరవింద్, మహేశ్, ఇందు, శ్రావిక, సాత్విక, సోనీలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఆర్మూర్ టౌన్: వాహనదారులు మోటారు వెహికల్ చట్టాన్ని ఉల్లంఘించి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ అన్నారు. ఆర్మూరు పీఎస్ పరిధిలో నంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

హాల్ టికెట్ల విడుదల

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా (సీవోఈ) కళాశాలల మొదటి ప్రవేశ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థుల సెకెండ్ లెవల్ కు సంబంధించిన హాల్ టికెట్స్ విడుదలైనట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సంగీత బుధవారం తెలిపారు. హాల్ టికెట్స్‌ను www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని అన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నిజాంసాగర్(జుక్కల్): నెల రోజుల కిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం స్థానిక ఏఎస్సై రాజేశ్వర్, బాధితుడికి అప్పగించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం కొందరు కూలీలు మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి వలస వచ్చారు. ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్, లోకేషన్ ఆధారంగా ట్రేస్ చేసి బాధితునికి అప్పగిచామని ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు..

- గత ప్రభుత్వం నుంచి అమలవుతున్నా వచ్చింది రెండు సార్లే..
- వడ్డీలేని రుణాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం



భీమ్‌గల్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

మోర్తాడ్: మహిళా సంఘాల్లోని సభ్యులకు వడ్డీ లేని రుణాలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వంద శాతం వడ్డీ రాయితీ రుణాల పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసినా వడ్డీని మహిళలకు చెల్లించడంలో విఫలమైంది. ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సంఘాల సభ్యులకు పావలా వడ్డీకి బ్యాంకు లింకేజీ రుణాలను అందించేవారు. బ్యాంకులు నిర్దేశించిన లెక్క ప్రకారం మహిళలు వడ్డీ, అసలు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం వడ్డీని రీ ఎంబెర్స్‌మెంట్ రూపంలో తిరిగి ఇచ్చేది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత వడ్డీలేని రుణాలు అందిస్తామని ప్రకటించింది. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేవలం రెండుసార్లు మాత్రమే వడ్డీ లేని రుణాలు ఇచ్చారు. వడ్డీ బకాయిలు పేరుకుపోయినా మహిళలకు నామమాత్రంగానే రాయితీ సొమ్ము చేతికి అందింది. 2023 సాధారణ ఎన్నికలకు ముందు రూ.200ల కోట్ల వడ్డీ బకాయిలకు రూ.72 కోట్లు మాత్రమే విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి జీరో వడ్డీ రుణాలను పక్కాగా అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆదివారం నిర్వహించిన సభలో వడ్డీలేని రుణాలను మహిళా సంఘాల సభ్యులకు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం బకాయి పడిన వడ్డీ రాయితీ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందా లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. జిల్లాలో 24,017 సంఘాలు ఉండగా ఇందులో రుణాలు అందుకోవడానికి అర్హత ఉన్న సంఘాలు 18,905 ఉన్నాయి. వీటికి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,032.74 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు రూ.986.45 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. రుణాల పంపిణీ లక్ష్యానికి చేరుకునే దశలో ఉండటం గమనార్హం. ఈ రుణాలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వడ్డీ రాయితీ వంద శాతం వర్తించనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీరో వడ్డీ రుణాల పంపిణీతో మహిళా సంఘాలపై ఆర్థికభారం తగ్గుతుంది. ఏది ఏమైనా మహిళా సంఘాల సభ్యులకు జీరో వడ్డీ రుణాల అంశం మరోసారి తెరపైకి రావడంతో మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పోలీసు వృత్తి ఎంతో గొప్పది

- పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణను ప్రారంభించిన సీపీ కల్మేశ్వర్
- జాన్కంపేట్ శిక్షణ కేంద్రంలో 195 మందికి శిక్షణ



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్



మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ

ఖలీల్‌వాడి: పోలీసు వృత్తి ఎంతో గొప్పదని, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉండేది పోలీసులే అని కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ అన్నారు. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ శివారులో ఉన్న పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన స్టయిఫండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుళ్ల తొమ్మిది నెలల శిక్షణను సీపీ బుధవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో కరీంనగర్, జగిత్యాల్, ములుగు జిల్లాల సివిల్ విభాగానికి చెందిన 195 మంది అభ్యర్థులకు శిక్షణ ఉంటుంది. ముందుగా సీపీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. ఉత్తమ విధులతో మంచి గుర్తింపు సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని, శిక్షణ కాలంలో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా శిక్షణ పొంది ప్రతిభా అవార్డులు పొందాలన్నారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, డీసీపీ జయ్‌రాం మాట్లాడుతూ.. సామాన్య పౌరులుగా ఉన్న వారు ఇప్పుడు పోలీస్ కుటుంబంలో సభ్యులుగా మారారని, శిక్షణ పొందే వారిలో వేష, భాషల్లో మార్పులురావాలన్నారు. శిక్షణలో ఇండోర్, అవుట్ డోర్ తరగతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఏసీపీ శ్రావణకుమార్, ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, బస్వారెడ్డి, పి.శ్రీనివాస్, ఎ. రవీందర్ రెడ్డి, నారాయణ, పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సరళ, ఆర్‌సీఐ కె.శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడో బెటాలియన్‌లో..

డిచ్‌పల్లి: సమాజంలో పోలీస్ అనేది బాధ్యతాయుతమైన వృత్తి అని కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ పేర్కొన్నారు. మండలంలోని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి కమాండెంట్ రాంప్రకాశ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎంపికైన ట్రైనీ ఏఆర్ కానిస్టేబుళ్ల శిక్షణను సీపీ బుధవారం ప్రారంభించారు. 9 నెలల శిక్షణలో నేర్చుకునే మెళకువలు ఉద్యోగంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. మారుతున్న కాలంతో పాటు మనం మారాలని, నిపుణులైన ట్రైనర్స్ వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కమాండెంట్ రాంప్రకాశ్ మాట్లాడుతూ.. 2002లో ఏడో బెటాలియన్‌ను ట్రైనింగ్ సెంటర్‌గా గుర్తించారని, ఇప్పటి వరకు బెటాలియన్‌లో 12 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 13వ బ్యాచ్‌లో సైబరాబాద్ ఏఆర్ ట్రైనీ కానిస్టేబుళ్లు 278 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఆంజనేయరెడ్డి, భాస్కర్ రావు, ఏవో హంసరాణి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, ట్రైనీ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు వచ్చిన ట్రైనీ కానిస్టేబుళ్లు

అర్ధరాత్రి లాఠీ పట్టిన కమిషనర్

- వాహనాల తనిఖీ
- రెండు హోటళ్లకు నోటీసులు




లాఠీ పట్టుకొని వాహనాలను ఆపుతున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ అర్ధరాత్రి లాఠీ పట్టారు. నగరంలో మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేయడంతో పాటు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేశారు. అర్ధరాత్రి పూట భారీ శబ్దం చేస్తూ వాహనం క్యాంపు కార్యాలయం ముందు నుంచి వెళ్లడంతో వెంటనే హోంగార్డు సహాయంతో బైకుపై వెళ్లి పట్టుకున్నారు. అనంతరం రెండు గంటల పాటు రోడ్లపై తిరుగుతున్న వాహనాలను తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు, పెట్రోలింగ్ పోలీసులు సీపీ వద్దకు చేరుకున్నారు. సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఒకటో టౌన్‌కు తరలించారు. అంతేకాకుండా రైల్వేస్టేషన్ వద్ద అర్ధరాత్రి వరకు తెరిచి ఉన్న హోటళ్లకు నోటీసులిచ్చారు. మళ్లీ రాత్రివేళ తెరిస్తే కేసులు నమోదు చేస్తామని సీపీ నిర్వాహకులను హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలపై సీపీ సీరియస్‌గా దృష్టి సారించిన విషయం తెలిసిందే. పోలీసులపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణ చేపట్టి మెమోలు, సస్పెండ్ చేయడం విదితమే. అలాగే వీడీసీలపై చర్యలు తీసుకున్నారు. గల్ఫ్ ఏజెంట్ల మోసాల కట్టడికి చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు చేయడంతో రోడ్లపై విచ్చలవిడిగా తిరిగే అల్లరిమూకలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారనే చర్చ జరుగుతోంది.

గ్రామంపై ఆర్మీ జవాన్ మమకారం

- పర్వతంపై ప్లకార్డుతో గ్రామం పేరు ప్రదర్శన



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తున్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన మహ్మద్ షాదుల్ ఎత్తైన మంచు పర్వతంపై తన స్వగ్రామం పేరును ప్రదర్శించి మమకారం చాటుకున్నారు. షాదుల్ రెండ్రోజులుగా జమ్మూకశ్మీర్‌లోని లదాఖ్‌లో గల 18 వేల అడుగుల ఎత్తులో ఉన్న పర్వతంపై మైనస్ 38 డిగ్రీల టెంపరేచర్‌లో ఉద్యోగాన్ని నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా స్వగ్రామం అన్నాసాగర్ పేరుతో ఉన్న ప్లకార్డును ప్రదర్శించాడు. గ్రామస్తులు షాదుల్‌ను అభినందించారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



భూమేశ్(ఫైల్)

బాల్కొండ: బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. వివరాలు. రెంజర్లకు చెందిన భూమేశ్(35) మెండోరా మండలం బుస్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల దుబాయి నుంచి వచ్చిన అతను మిత్రులను కలిసేందుకు మంగళవారం బుస్సాపూర్‌కు బయలుదేరాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోని పెద్దవాగు రోడ్డుపై బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..

నవీపేట: నవీపేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహమూద్ బుధవారం తెలిపారు. రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో కాళ్లు, చేతులు విరిగి మృతి చెందాడని పేర్కొన్నారు. వృద్ధుడి వయస్సు సుమారు 60 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సాటాపూర్‌లో బాలుడి అదృశ్యం

రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో రిషి అనే తొమ్మిదేళ్ల బాలుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై బాబురావు తెలిపారు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రిషి తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి మద్యం సేవించి రిషిని బెదిరించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. రిషి మేనత్త భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు

భిక్కనూరు: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి కామారెడ్డి న్యాయమూర్తి రెండు రోజుల జైలు, రూ. 200 వందల జరిమానా విధించినట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సిద్ధరాములు ఇటీవల డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడడంతో కోర్టులో హాజరుపర్చగా జడ్జి జైలు శిక్ష, జరిమానా విధించారు.

వాహనం ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

డిచ్‌పల్లి: బీబీపూర్ తండాలోని జాతీయరహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి కల్యాణ్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపూర్‌కు చెందిన కల్యాణ్ బుధవారం అర్ధరాత్రి రహదారికి అవతలి వైపు ఉన్న బీబీపూర్ తండాలో నిర్వహించే పెళ్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో రహదారిని దాటుతుండగా డిచ్‌పల్లి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ కల్యాణ్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కారులో తరలిస్తున్న మద్యం పట్టివేత

ఖలీల్‌వాడి: కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న బుధవారం తెలిపారు. రెంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన గురడి మహిపాల్‌రెడ్డి 8 మద్యం బాటిళ్లను మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఈ దాడిలో ఎనిమిది మందిని పట్టుకొని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 8,270 నగదు, 9 సెల్‌ఫోన్లు, 13 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని అన్నారు. వీరిని మాక్లూర్ పోలీసులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

- ఆయకట్టుకు కొనసాగుతున్న నీటి విడుదల



ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: ఎస్సారెస్పీ నీటి నిల్వ 35 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్ ఆయకట్టు కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నీటి మట్టం తగ్గుతోంది. ప్రస్తుత యాసంగి సీజన్ ప్రారంభం నాటికి ప్రాజెక్ట్‌లో 78 టీఎంసీల నీటి నిల్వ ఉంది. యాసంగి సీజన్‌లో కాలువల ద్వారా నీటి విడుదలను డిసెంబర్ 18 నుంచి ప్రారంభించారు. రెండు నెలల వ్యవధిలో 43 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 35 టీఎంసీల నీరు ఉండగా అందులో 5 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, మరో ఐదు టీఎంసీలు డెడ్ స్టోరేజీ, ఆవిరి రూపంలో పోయేది 5 టీఎంసీలు పోను 20 టీఎంసీల నీరు మాత్రమే వినియోగానికి ఉంది.

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500, లక్ష్మీకాలువ ద్వారా 250, అలీసాగర్ లిప్టు ద్వారా 347, గుత్ప లిప్టు ద్వారా 270, సరస్వతి కాలువ ద్వారా 600, ఆవిరి రూపంలో 468 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1072.9(35 టీఎంసీలు)ల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1078.9(49.44 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా కుటుంబీకులు సీతారాముల వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రతియేటా మాఘశుద్ధ త్రయోదశి రోజు సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆనవాయితీ నిర్వహిస్తున్నారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన గంగోత్రి పీఠం రామానుజదాసన్ స్వామిజీ, కేదార్‌నాథ్‌కు చెందిన దీనబంధు స్వామీజీలు కల్యాణ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సీతారాములు వారికి గరుడ సేవ నిర్వహించనున్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సర్పంచ్ గడ్డం రాధాకిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పి.మహేందర్‌రెడ్డి, దువ్వ నర్సయ్య, వీడీసీ సభ్యులు వారాల సాయిలు, తోట చిన్న సాయిలు, మాజీ సర్పంచ్ బూస సుదర్శన్, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలను పాటించాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్‌టౌన్: బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలను యువత పాటించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రత్యేక పూజలు చేసి బోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బంజారా విద్యార్థులతో కలిసి నృత్యం చేశారు. వేడుకల్లో ఆలిండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్, ఆర్డీవో రాజాగౌడ్, కమిషనర్ వెంకట నారాయణ, ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ గంగాధర్, డీసీసీ డెలికెట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షుడు పాషామొయినొద్దీన్, బంజారా సేవా సంఘం నాయకులు దూప్‌సింగ్, సంజీవ్, రవిదాస్, గణేశ్, ప్రవీణ్, విఠల్, లక్ష్మణ్, రమేశ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

బస్ డ్రైవర్‌పై దాడి

- మూడు గంటల పాటు డ్రైవర్ల ధర్నా
- ఇబ్బంది పడిన ప్రయాణికులు



ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణంలో ప్రైవేట్ ఆర్టీసీ డ్రైవర్‌పై ముగ్గురు ప్రయాణికులు బుధవారం దాడి చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి మెట్‌పల్లికి వెళ్లేందుకు ప్లాట్‌ఫాంపై సిద్ధంగా ఉన్న బస్సు కండక్టర్ కోసం డ్రైవర్ హారన్ చేశాడు. దీంతో బస్సు ఎదుట ఉన్న ముగ్గురు ప్రయాణికులు డ్రైవర్ నర్సయ్యపై దాడి చేశారు. దీంతో డ్రైవర్లు బస్సులను నిలిపివేశారు. దీంతో మూడు గంటల పాటు ఆర్టీసీ ప్రాంగణంలోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డిపో మేనేజర్ డ్రైవర్లను, కండక్టర్లను పిలిపించి మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విధుల్లో చేరారు. బస్సులలో ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ డ్రైవర్లపై దాడి సరైందని కాదని ప్రైవేట్ హైర్ బస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారిణి

వర్ని: లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన, చేయించిన, చేసుకున్న వారికి జైలు శిక్ష తప్పదని జిల్లా ఐసీడీఎస్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బీ అన్నారు. మండల కేంద్రంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అంగన్‌వాడీ, ఐకేపీ, ఆశా కార్యకర్తలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లలపై వివక్షత చూపరాదని ఈ చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఆడపిల్లల, మహిళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ జానకమ్మ, సూపర్‌వైజర్ వనజ, జిల్లా మహిళా సాధికారిక కో–ఆర్డినేటర్ స్వప్న, పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ రాంబాబు, జమున పాల్గొన్నారు.

సౌదీలో గాంధారి వాసి ఆత్మహత్య



పోశయ్య(ఫైల్)

గాంధారి: సౌదీలో గాంధారి వాసి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి పోశయ్య(52) బతుకుదెరువు నిమిత్తం గత 20 ఏళ్ల నుంచి సౌదీకి వెళ్తూ వస్తున్నాడు. గతేడాది స్వగ్రామానికి వచ్చిన పోశయ్య కుమారుని వివాహం చేశాడు. నాటి నుంచి కల్లుకు అలవాటుపడ్డాడు. ఇటీవల సౌదీకి వెళ్లిన పోశయ్య వింతగా ప్రవరిస్తున్నట్లు అక్కడి స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. కల్లుకు అలవాటు పడ్డ పోశయ్య సౌదీలో లభించకపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడు. మంగళవారం రాత్రి తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని కుటుంబీకులు తెలిపారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ కృషి చేయాలని కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

మాక్లూర్: కుటుంబ కలహాలతో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాక్లూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తాహెర్ మోబీన్(48) ఇటుక బట్టీల వ్యాపారం చేస్తుంటాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 20న రాత్రి భార్యతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై మోబీన్ స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

రుద్రూర్: మండలంలోని గైని గుట్ట శ్రీ స్వయంభూబసవేశ్వర ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీ తాళం పగల గొట్టి అందులోని డబ్బులు తస్కరించారు. బుధవారం తెల్లవారు జామున పూజలు నిర్వహించడానికి వెళ్లిన పూజారి పరమేశ్వర్ చోరీ జరిగినట్టుగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేయాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు.

సాటాపూర్‌లో కారు..

రెంజల్: మండలంలోని సాటాపూర్‌లో ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన కారు చోరీకి గురైనట్లు ఏఎస్సై బాబురావు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన అబ్దుల్ రవూఫ్ తన కారును ఇంటి ఎదుట మంగళవారం రాత్రి పార్కింగ్ చేసి నిద్రించాడు. ఉదయం చూసే సరికి కారు కనిపించక పోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.